| | |
|---|---|
| **Date:** 9.8.2021 | **Publication:** Sakshi |
| **Page no.:** 4 | **Edition:** Hyderabad |
| **Headline:** Simplicity of Health Reimbursement Claims | |

# ఆరోగ్య బీమా క్లెయిమ్.. సులభతరం


భాస్కర్ నెరూర్కర్



హెడ్ (హెల్త్ క్లెయిమ్స్), బజాజ్ అలయంజ్ జనరల్ ఇన్సూరెన్స్


కోవిడ్-19తో అందరి జీవితాలు ఒక్క సారిగా మారిపోయాయి. అందరిపైనా ఏదో విధంగా ప్రభావం పడింది. ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారులు ఎప్పుడైనా ఏ విధంగానైనా మనల్ని ఉక్కిరిబిక్కిరి చేయొచ్చన్న వాస్తవాన్ని ఇది గుర్తు చేసింది. అలాగే ఆరోగ్య బీమా కలిగి ఉండాల్సిన ఆవశ్యకతను కూడా తెలియజెప్పింది. దీంతో ఆరోగ్య బీమాపై అవగాహన పెరుగుతోంది. ప్రధానంగా 25–45 ఏళ్ల వయస్సు గలవారు హెల్త్ ఇన్సూరెన్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. తమకు, తమ కుటుంబానికి అనువైన పథకాల గురించి అన్వేషిస్తున్నారు. అయితే, ఇదే సమయంలో పాలసీల గురించి కొన్ని అపోహలు కూడా నెలకొన్నాయి. అలాంటి వాటిల్లో క్లెయిమ్స్ సెటిల్మెంట్ ప్రక్రియ కూడా ఒకటి.

సాధారణంగా ఆరోగ్య బీమా క్లెయిమ్‌లను రెండు రకాలుగా.. అంటే నగదురహిత (క్యాష్‌లెస్), రీయింబర్స్‌మెంట్ రూపాల్లో బీమా సంస్థలు సెటిల్ చేస్తుంటాయి. క్యాష్‌లెస్ పేరుకు తగ్గట్లుగానే చికిత్స వ్యయాలను బీమా కంపెనీ నేరుగా ఆస్పత్రికి చెల్లిస్తుంది. అయితే, ఈ విధానం నెట్‌వర్క్‌లోని కొన్ని ఆస్పత్రులకు మాత్రమే అందుబాటులో ఉంటోంది. మెట్రోలు, ప్రథమ శ్రేణి నగరాల్లోనే మెజారిటీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉంటున్నాయి. ద్వితీయ శ్రేణి, గ్రామీణ ప్రాంతాల్లో వీటి సంఖ్య తక్కువ కావడంతో క్లెయిమ్ సెటిల్మెంట్ కోసం రీయింబర్స్‌మెంట్ విధానం ఎంచుకోవాల్సి ఉంటోంది. అయితే, రీయింబర్స్‌మెంట్ ప్రక్రియ చాలా సంక్లిష్టమైనదని, కష్టంతో కూడుకున్నదనే అభిప్రాయం నెలకొంది. చిన్న పట్టణాల్లో నెట్‌వర్క్ ఆస్పత్రులు తక్కువగా ఉంటాయి కాబట్టి హెల్త్ ఇన్సూరెన్స్ అనేది మెట్రోలు, పెద్ద నగరాలకు మాత్రమే అనువైనదని చాలా మంది భావిస్తుంటారు. కానీ ఇది వాస్తవం కాదు. రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ అనేది అంతా అనుకునేంత సంక్లిష్టమైనది కానే కాదు. కేవలం కొన్ని దశల్లో దీన్ని ఫైల్ చేయొచ్చు.

- ముందుగా పాలసీదారు.. చికిత్స వ్యయాలను కట్టేయాల్సి ఉంటుంది.
- తర్వాత అన్ని ఒరిజినల్ పత్రాలు, ఆస్పత్రి బిల్లులు, డిశ్చార్జి సమ్మరీ, రిపోర్టులు మొదలైనవన్నీ మర్చిపోకుండా తీసుకోవాలి. క్లెయిమ్ సెటిల్మెంట్ కోసం ఒరిజినల్ బిల్లులు తప్పనిసరి అని గుర్తుపెట్టుకోండి. భవిష్యత్తులోనూ ఉపయోగపడేందుకు వాటన్నింటి కాపీలు కూడా తీసుకుని దగ్గర పెట్టుకోవడం శ్రేయస్కరం.
- సెటిల్మెంట్ ప్రక్రియ ప్రారంభించేందుకు .. మీ హెల్త్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ ఫారంను మీ బ్యాంకు ఖాతా, ఎన్ఈఎఫ్‌టీ వివరాలతో సహా నింపాలి.
- ఆ పత్రాలను సమీపంలోని బీమా కంపెనీ శాఖలో సమర్పించాలి.

**అన్ని పత్రాలు లేకపోతేనే జాప్యం..**

కొన్ని సార్లు అవసరమైన పత్రాలన్నీ సమర్పించకపోవడం వల్ల క్లెయిమ్ సెటిల్మెంట్ ప్రక్రియలో జాప్యం జరగవచ్చు. కాబట్టి క్లెయిమ్ ఫారంను క్షుణ్నంగా చదువుకుని, వివరాలన్నీ నింపి, అవసరమైన పత్రాలన్నీ సమర్పించాలి. క్లెయిమ్ ఫారంలోనే ఏయే పత్రాలు జతపర్చాలన్నది చెక్ లిస్ట్ ఉంటుంది. అవేంటంటే..

- **పూర్తిగా నింపి, సంతకం చేసిన క్లెయిమ్ ఫారం. బీమా కంపెనీ వెబ్‌సైట్‌లో ఈ ఫారం లభిస్తుంది.**
- **ఒరిజినల్ డిశ్చార్జి సమ్మరీ**
- **అంశాలవారీ వివరణతో ఆస్పత్రి ఇచ్చిన ఒరిజినల్ బిల్లు**
- **చెల్లింపులకు సంబంధించిన ఒరిజినల్ రసీదులు**
- **ల్యాబ్, టెస్ట్ రిపోర్టులు (ఎంఆర్ఐ, సీటీ స్కాన్, ఈసీజీ వంటివి)**
- **డాక్టర్ ఇచ్చిన కన్సల్టేషన్ లెటరు**
- **బ్యాంకు వివరాలు**
- **ఐడీ (పాన్ కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు వంటివి) ఫొటో కాపీ**
- **ఇతరత్రా కేసు పేపర్లు (ఏవైనా ఉంటే)**

## ఇవి మరవొద్దు..

అవసరమైతే బీమా కంపెనీ మీతో సంప్రదింపులు జరిపేందుకు ఉపయోగపడేలా మీ సరైన మొబైల్ నంబరు, ఈమెయిల్ ఐడీ ఇవ్వండి. బీమా సంస్థతో జరిపే సంప్రదింపులన్నింటికీ రికార్డు ఉండేలా పత్రాలను రిజిస్టర్డ్ పోస్టు లేదా కొరియర్ ద్వారా పంపడం మంచిది. ప్రస్తుతం చాలా మటుకు బీమా సంస్థలకు యాప్‌లు ఉన్నాయి. ప్రక్రియ ప్రారంభం కావడం కోసం రీయింబర్స్‌మెంట్ డాక్యుమెంట్‌ను ముందుగా వీటిలో అప్‌లోడ్ చేసి, ఒరిజినల్ పత్రాలను తర్వాత కొరియర్ చేయొచ్చు. కోవిడ్ కారణంగా పత్రాలను కొరియర్ చేయడానికి సమయం పట్టేస్తున్నందున ఈ విధానం ఉపయోగకరంగా ఉండగలదు. మీరు బిల్లులతో పాటు క్లెయిమ్ ఫారం సమర్పించిన తర్వాత బీమా సంస్థ వాటిని ధృవీకరించుకుంటుంది. అన్నీ సరిగ్గానే ఉన్నాయని ధృవీకరించుకున్నాక, మీ రిజిస్టర్డ్ బ్యాంకు ఖాతాలోకి కంపెనీ క్లెయిమ్ మొత్తాన్ని జమ చేస్తుంది.